# తొలి పర్యటనలోనే కలెక్టర్ మార్క్



- ప్రజలను తాతా, అమ్మా అంటూ ఆప్యాయంగా పలకరింపు
- ప్రతీ సమస్యను క్షుణంగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు

2 లో

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 20 | జూన్ | 2025
పేజీలు : 8

- చోద్యం చూస్తున్న అధికారులు
- నిబంధనలకు తూట్లు.. డొనేషన్ల వసూళ్లు
- నైట్ డ్రెస్‌లు అక్కడే కొనాలట
- హార్వెస్ట్‌పై చర్యలు తీసుకోండి : ఎఐఎస్ఎఫ్



మారిన, మారుతున్న ఆలోచనలు కొందరికీ వరంగా మారుతున్నాయి. ప్రభుత్వ బడి వద్దు ప్రైవేటు ముద్దు అన్న ఆలోచన ప్రైవేటు విద్యా సంస్థల శృతిలేని దోపిడీకి తెరలేపింది. తమ దగ్గర కాకపోతే ఇంకెక్కడ చేర్పిస్తారు అన్న భావన అహంభావాన్ని తెర లేపడంతో పాటు ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందిలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.నిబంధనలకు పాతరేసి రక రకాలుగా ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నా, అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నా విద్యాశాఖ కళ్లు ఉండి చూడలేని కబోదిలా మారింది. జిల్లా యంత్రాంగం ప్రైవేటు విద్యాలయాలకు ముఖ్యంగా కొన్నింటికి దాసోహం అంటున్నారు. గోడౌన్స్ ఏర్పాటు చేసి పుస్తకాల పేరుతో బట్టలు, బూట్లు వ్యాపారం చేస్తున్నాయి. నైట్ డ్రెస్‌లు మా వద్ద కొనుగోలు చేస్తేనే అన్నట్లుగా వ్యవహరిస్తున్నా ఆ వైపు చూసినా అధికారి లేడు. శృతిమించిన విద్యా దోపిడీని నిలువరించేదెవరు...?

-ప్రజాపక్షం/ఖమ్మం

2 లో



# శృతిమించిన విద్యాదోపిడీ..!



# సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన



- పూర్తి స్థాయిలో రైతుభరోసా నిధులు జమ
- రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

ప్రజాపక్షం/కూసుమంచి : పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి కూసుమంచి మండలంలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని నర్సింహుల గూడెం నుండి గైగొళ్లపల్లి వరకు రూ. 2.51 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, రూ. 60 లక్షలతో గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు, పుర్యతండా నుండి ఆర్అండ్‌బి రోడ్డు వరకు రూ. 76 లక్షలతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు, హైత్యతండాలో చింతల తండా వరకు

మిగతా 2లో..

## పాలస్తీనా యుద్ధం వెనుక
# అమెరికా సామ్రాజ్యవాదం




- ఆయుధ వ్యాపారం కోసమే దేశాల మధ్య చిచ్చు
- ఇరాన్, ఇజ్రాయేల్ యుద్ధంపై మోడీ నోరు మెదపాలి
- సిపిఐ నేత కూనంనేని
- కొత్తగూడెంలో వామపక్షాల నిరసన

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఆయుధ వ్యాపారాన్ని విస్తరింపజేసుకునేందుకు దేశాల మధ్య చిచ్చు పెడుతూ అమెరికా ఆయుధాలను ప్రేరేపిస్తోందని, ఇది ట్రంప్ సామ్రాజ్యవాద కక్షకు ఇరాన్ ఇజ్రాయేల్ యుద్ధం పరాకాష్టని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు విమర్శించారు. వామపక్ష పార్టీల జాతీయ కమిటీల పిలుపులో భాగంగా గురువారం

మిగతా 2లో..

# శృతిమించిన విద్యా దోపిడీ..!

**ప్రజాపక్షం/ఖమ్మం :** సమాజంలోని మార్పులను వ్యవస్థీకృతం చేసి రాజ్యాంగ పరిధిలోకి తీసుకు రావాల్సి ఉంది. విద్యకు సంబంధించి 20 శాతానికి లోబడి మాత్రమే ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్నప్పుడు 80 శాతం మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థల ఏర్పాటు, నిర్వహణ, ఫీజులు, బోధన సిబ్బంది, మౌలిక వసతులు తదితర విషయాలకు నిబంధనలు రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. నేడు విద్యా సంస్థ ఏర్పాటు అది అండ పిండ బ్రహ్మాండమంటూ ప్రచారం చేస్తూ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. రెండు, మూడు తరగతులకే లక్షల రూపాయల ఫీజు, రూ. 10వేల డోనేషన్ అని ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇక యూనిఫాం, పుస్తకాలు, షూ ధరలు దేశంలోనే ఆ ధరలు ఎక్కడ ఉండవు. ఈ విషయం అధికార యంత్రాంగానికి తెలియంది కాదు. గోడౌన్స్ ఏర్పాటు చేసి కౌంటర్లు పెట్టి ప్రైవేటు విద్యా సంస్థలు వ్యాపారం నిర్వహిస్తున్నా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. నిబంధనలు బేఖాతర్ చేస్తూ విద్యా సంస్థల్లో ఎటువంటి సౌకర్యాలు ఉండవు. బహుళ అంతస్తుల భవనాల్లో రక్షణ లేకుండానే పాఠశాలలు నిర్వహిస్తున్నా మీ ఇష్టం మాకు ఫిర్యాదు రాకుండా చూసుకోండి అంటున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. ఏ ప్రాంతంలో పాఠశాల నిర్వహణకు అనుమతి తీసుకున్నారు, ఎక్కడ నిర్వహిస్తున్నారు, ఎన్ని బ్రాంచీలు ఉన్నాయి అన్న దానిపై పట్టింపు లేదు. విద్యాశాఖ ప్రైవేటు విద్యా సంస్థలకు దాసోహం అంటే జిల్లా ఉన్నతాధికారులు ఏమి చేస్తున్నట్లు...? రక్షణ లేని బహుళ అంతస్తుల భవనాల్లో ప్రమాదం జరిగితే చిన్నారుల పరిస్థితి ఏమిటి...? ఇప్పుడు కాకుండా చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకుంటారా అన్న ప్రశ్నకు సమాధానమే లేదు. విద్యాశాఖ నుండి అనుమతి తీసుకునేటప్పుడు విద్యాశాఖకు సమర్పించిన ధృవపత్రాలకు, విద్యా సంస్థల్లో ఉన్న పరిస్థితులకు పొందిక ఉందా అంటే అనుమానమే. అయినా ఎవరు మాట్లాడారు.

### ఫీజులపై నియంత్రణ ఉండదా...?

ప్రైవేటు విద్యా సంస్థలు కొన్ని సేవాభిలాషతో ఏర్పాటు చేసి ఉండవచ్చు. అందుకు అనుగుణంగానే పాఠశాల సేవాభావంతోనే నిర్వహిస్తుండవచ్చు. కానీ ధనార్జనే ధ్యేయంగా విద్యా సంస్థలను లాభసాటి కేంద్రాలుగా మార్చే విద్యా సంస్థలపై తప్పక చర్యలు తీసుకోవాలి. ఫీజుకు హద్దు లేకపోతే ఎలా అన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. పిల్లలను చదివించాలంటే ఆస్తులు అమ్మక తప్పనిసరి పరిస్థితులు ఎదురవుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటులో చదివించాలన్న అభిలాషను సొమ్ము చేసుకుంటున్నారు. కోట్లాది రూపాయల వ్యాపారం సాగుతున్న పరిస్థితుల నేపథ్యంలో అధికార యంత్రాంగం చేష్టలూడిగి చూస్తుండడం విద్యార్థుల తల్లిదండ్రులకు శాపంగా మారింది.

### హార్వెస్ట్‌పై చర్యలు తీసుకోండి...

అడ్డు అదుపు లేకుండా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న హార్వెస్ట్ విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. హార్వెస్ట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. గోడౌన్లు ఏర్పాటు చేసి పుస్తకాలు, దుస్తులు, బూట్లు, ఇతరత్రా సామాగ్రి అధిక ధరలకు విక్రయిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. హార్వెస్ట్‌లో ఇష్టానుసారంగా ఫీజులతో పాటు డోనేషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

# తొలి పర్యటనలోనే కలెక్టర్ మార్క్





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** జిల్లా కలెక్టర్‌గా పని చేయడం ఐఏఎస్ అధికారుల సర్వీసులో ఎంతో అరుదైన అవకాశం. పాలనాధికారిగా అన్ని ప్రభుత్వ శాఖలపై అజమాయిషీ ఉండే ఎంతో గొప్ప బాధ్యత. ఇందులో భాగంగా ఊపిరి సలపనియ్యని పనులతో బిజీబిజీగా ఉంటారు. ఒక వేళ పర్యటనలకు వచ్చిన అలా వచ్చి ఇలా వెళ్లిపోతారు...కానీ ఖమ్మం జిల్లాకు నూతన కలెక్టర్‌గా తాజాగా బాధ్యతలు స్వీకరించిన అనుదీప్ దురిశెట్టి మాత్రం..ఏదులాపురంలో గురువారం సాగించిన తన తొలి పర్యటనలోనే ఎంతో ఓపికను కనబరచి ప్రజలను మన్నలను పొందారు. అధికారులకు సైతం ప్రజా సమస్యలపై సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా భూభారతి రెవిన్యూ సదస్సులు, పల్లెదవాఖాన, అంగన్వాడీ కేంద్రం, ఈదుల చెరువును పరిశీలించారు...భూభారతి సదస్సుల్లో రైతుల వద్ద నుంచి నేరుగా అప్లికేషన్లను స్వీకరించారు. తాత అంటూ అప్యాయంగా పలకరిస్తూ సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వాటిలోని లోటు పాట్లను అక్కడిక్కడే తెలపడంతో పాటు పరిష్కరించగలిగిన సమస్యలను ఎలా చేయాలో రెవిన్యూ అధికారులకు సూచించారు. సర్వేయర్ ద్వారా పకడ్బందీ సర్వే చేపించి సమస్యలను పరిష్కారం అయ్యేలా చూడాలని అదేశించారు. అనంతరం మాట్లాడుతూ... నిబంధనల ప్రకారం భూ సమస్యలు భూభారతితో పరిష్కా రం జరుగుతుందన్నారు. అలాగే ఊరు చెరువు కబ్జాపై సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అందిన ఫిర్యాదు మేరకు స్పందించారు. కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సర్వే చేపించి హద్దులు గుర్తించాల్సిందిగా ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం వాక్‌వేను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ విజ్ఞప్తి మేరకు చెరువును పరిశీలించారు. రాబోయే 10నుంచి20సంవత్సరాల కాలానికి ఉపయోగపడేలా చెరువు పరిశర ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఆహ్లాదకరమైన పచ్చని వాతావరణంతో పాటు నీడనిచ్చే విధంగా చెట్లను పెంచాలన్నారు. అలాగే పల్లె దవాఖాన, అంగన్వాడీ కేంద్రను పరిశీలించారు. దవాఖాన ద్వారా ప్రజలకు గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవలు, పల్లె దవాఖానలో ఔషధ వివరాలను ఆశాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలకు టీకాలను సకాలంలో అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలవరీలు జరిగేలా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. బీపి చెక్ చేయించుకుని, తనకు బీపీ తక్కువగా ఉందా అంటూ నవ్వులు పూయించారు. అనంతరం అక్కడే ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లల అటెండెన్స్, స్టాఫ్ వివరాలను అడిగి తెలుసుకొని పిల్లలకు అందించే గుడ్లు, బాలామృతం స్టాక్ వివరాలను పరిశీలించారు. కోడి గుడ్లు నాణ్యత పరిశీలించి స్టాక్ తీసుకోవాలని అన్నారు. పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని అన్నారు. పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు వచ్చాయా? అని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఏదులాపురం ఎస్‌సీకాలనీలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులైన మేళ్లచెర్వు వెంకమ్మ, గరిక రాధలతో మాట్లాడారు..నిర్మాణంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా?అని అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం వేగంగా చేసుకుంటే ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయని అన్నారు. ఇంటి నిర్మాణంలో ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే తెలియజేయాలన్నారు. నిర్మాణానికి ఇసుక సమస్య రాకుండా కూపన్ ద్వారా ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఎలక్షన్‌డీటీ రవీందర్, ఆర్ఐ ప్రసాద్, మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రెవిన్యూ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, సిపిఐ నాయకులు దండి రంగారావు, వెంపటి సురేందర్, వెన్నం భాస్కర్, సిపిఐ సోషల్‌మీడియా ఇంఛార్జ్ రెబ్బగొండ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

# సమీక్షలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాఖకు సంబంధించి ఏపిసి రఘునందన్ రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు. గురువారం నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, హార్టికల్చర్ అధికారి మురళీధర్‌రావు, జిల్లా సహకార అధికారి గంగాధర్, వ్యవసాయ సహాయ సంచాలకులు, ఏవో టెక్నికల్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతుభరోసా, రైతు బీమా, యూరియా, పెండింగ్‌లో ఉన్న యూరియా రశీదులు, ఈ పివోఎస్ యంత్రాల పంపిణీ, రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియ, మట్టి నమూనాల సేకరణ, సహజ వ్యవసాయం, పిఎం కిసాన్ పై సమీక్షలో చర్చించారు.



# సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన

(మొదటిపేజీ తరువాయి)

రూ. 1.10 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, పోచారం గ్రామంలో రూ. 20 లక్షలతో అంతర్గత సిసి రోడ్డు నిర్మాణ పనులకు, కూసుమంచి ఎస్సి కాలనీలో రూ. 38 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నర్సింహులగూడెంలో రూ. 60 లక్షలతో ఎత్తిపోతల పథకం మరమ్మతుల కోసం మంజూరు చేశామన్నారు. ఇండ్లపై హైటెన్షన్ విద్యుత్ వైర్లు లేకుండా కార్యచరణ చేపట్టామన్నారు. పుర్యతండాలో రూ. 45 లక్షలతో సిసి రోడ్డును నిర్మించామన్నారు. పోచారం గ్రామంలో రూ. 4.89 కోట్లతో మూడు బిటి రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. కూసుమంచిలో రూ. 1.20 కోట్లతో అంతర్గత రోడ్లు నిర్మించినట్లు మంత్రి తెలిపారు. రూ. 1.65 కోట్లతో రావిచెట్టు తండా వరకు రోడ్డు నిర్మాణానికి, రూ. 50 లక్షలతో షాదీఖానా, రూ. 7.5 లక్షలతో ఎస్సి కమ్యూనిటీ హాల్, రూ. 9 లక్షలతో త్రాగునీటి పనులు పూర్తి చేశామన్నారు. ప్రజల దీవెనతో రాష్ట్రంలో ఏడాదిన్నర క్రితం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. గత పాలకులు అమలు చేసిన మంచి పథకాలను కొనసాగిస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలెండర్, రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డుల మంజూరు, కొత్త సభ్యుల చేరిక, ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 10లక్షలకు పెంపు, డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రైతు భరోసా క్రింద పెట్టుబడి సాయం క్రింద ఎకరానికి రూ. 10వేల నుంచి రూ. 12 వేలకు పెంచి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రాబోయే మూడు నాలుగు రోజుల్లో సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు పూర్తి స్థాయిలో రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు రుణమాఫీ క్రింద రూ. 21వేల కోట్లు ఖర్చు చేసి రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసిందన్నారు. సన్న వడ్లకు రూ. 500 బోనస్‌తో అందిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉంటుందని ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. లబ్దిదారులకు నాలుగు విడతల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందుతుందన్నారు. అంతకు ముందు మంత్రి కూసుమంచికి మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ స్థలాన్ని కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకటరెడ్డి, ఆర్అండ్‌బి ఈఈ యుగంధర్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాలస్తీనా యుద్ధం వెనుక

# అమెరికా సామ్రాజ్యవాదం

(మొదటిపేజీ తరువాయి)

సంఘీభావ దినాన్ని ప్రకటిస్తూ సిపిఐ,సిపిఎం, న్యూడెమోక్రసీ కార్యాలయాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ ప్రపంచ దేశాలను తన చెప్పుచేతల్లో పెట్టుకుని కర్రపెత్తనం చేస్తోందని మండిపడ్డారు. రెండు దశాబ్ధాలుగా పాలస్తీన ప్రజలపై ఇజ్రాయేల్ నిరంతరం బాంబు, వైమానికి దాడులకు పాల్పడుతూ లక్షలాది మందిని పొట్టనపెట్టుకుంటూ మారణహోమాన్ని సృష్టిస్తుంటే అంతర్జాతీయ చట్టాలు, మానవహక్కులు హరించుకుపోతున్న పరిస్థితుల్లో పాలస్తీన ప్రజలకు యూవత్ ప్రపంచం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా ప్రోత్సాహంతో ఇజ్రాయేల్ జరుపుతున్న భీబత్సవాన్ని నిలిపిచేయాలని, శాంతి ఖాముఖులు రోడ్డెక్కి ఇతర దేశాలకు స్ఫూర్తినివ్వాలని పిలుపునిచ్చారు. అమెరికా ముందు మోకరిల్లే విధానాలకు స్వస్తి చెప్పి ఇరాన్, ఇజ్రాయేల్ యుద్ధంపై ప్రధాని మోడి ట్రంప్‌కు వ్యతిరేకంగా నోరు విప్పాలన్నారు. యుద్ధాన్ని నిలిపేసి అక్కడి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ముందుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద బిక్షం ఎన్‌డి నాయకులు కె సురేందర్ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, నేరేళ్ల రమేష్, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణ చారి, యూసుఫ్, షాహీన్, ఏజే రమేష్, బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, ఎస్ లక్ష్మీ, గౌరి నాగేశ్వరరావు, కల్తీ వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మీ, ప్రణయ్, జాటోత్ కృష్ణ, మాచర్ల సత్యం, అమర్లపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

# 145 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం/వైరా:** ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు ఎందుకు అంటే రేషన్ షాపు డీలర్లు మిల్లర్లు కలిసి నడుపుతున్న ఓ సరికొత్త దందానే రేషన్ దందా, వైరా పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై ఎస్సై పి.రామారావు ఆధ్వర్యంలో గురువారం ఉదయం అక్రమంగా తరలుతున్న 145 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కల్లూరు నుంచి గజ్వేల్‌కు ఏపి29టిఏ7032 నెంబర్ గల లారీలో అక్రమంగా 145 క్వింటాళ్ల రేషన్ సన్నబియ్యం తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వైరా పోలీసులు జాతీయ రహారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టుబడింది. లారీలో 290 బ్యాగులతో ఉన్న 145 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్న లారీని పోలీసులు సీజ్ చేశారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



### కాంగ్రెస్ నాయకుల దాడులకు

# పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన మహిళలు



**ప్రజాపక్షం/బోనకల్ :** కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాలు, దాడులకు తట్టుకోలేక బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, మహిళలు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన సంఘటన ఖమ్మం జిల్లా బోనకల్ మండలం బ్రాహ్మణ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరరాలిలా ఉన్నాయి. గత వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన మడుపల్లి వెంకటేశ్వర్లు ఆటోలో ప్రయాణిస్తుండగా ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్య క్షుడు పెద్దప్రోలు సైదులు అతని కుమారుడు కార్తీక్‌లు వెంకటేశ్వర్లు ప్రయాణిస్తున్న ఆటోను ఆపి ఇనుపరాడుతో దాడి చేశారు. దాడిలో వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలై అపస్మారకస్థితిలో పడిపోయాడు. ఈ సంఘటన గమనించిన స్థానికులు దాడిని అడ్డుకున్నారు. ఈ విషయం పై ప్రశ్నించిన మడుపల్లి వెంకటేశ్వర్లు తల్లి రాధమ్మపై కూడా దాడికి దిగారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి చెందిన సైదులు అతని కుమా రుడు కార్తీక్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులపై దౌర్జన్యానికి దిగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానిక కాంగ్రెస్ నేతలకు తెలిపారు. అయినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో పోలీ స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం వలన కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారిం చలేదని బాధితులు వాపోయారు. బ్రాహ్మణపల్లి గ్రామం నుంచి పెద్ద ఎత్తున మహిళలు, బాధిత కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీ చెందిన నాయకుల ద్వారా ప్రాణ భయం ఉందని వారి నుండి కాపాడాలంటూ గురువారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై మొగిలి వెంకన్న పోలీస్‌స్టేషన్ ఆశ్రయించిన వారి నుండి జరిగిన సంఘటనపై విచారించారు. పెద్దప్రోలు సైదులు, కార్తీక్‌ల వలన ప్రాణ భయం ఏర్పడిందని విచారించి ఇలాంటి దౌర్జన్యాలను దాడులను అరిక ట్టాలని ఎస్సైను వేడుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేపడతానని, అన్యాయంగా దౌర్జన్యాలకు దిగి దాడులు చేస్తే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జునరావు, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ జెర్రిపోతుల రవీం దర్, గ్రామశాఖ అధ్యక్షులు వంగాల కృష్ణ మాట్లాడుతూ దౌర్జన్యంగా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సైను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వంగాల సీత, పార్టీ నాయకులు రామి శెట్టి రవికుమార్, గుడిద శ్రీరామ్, ఎనమద్ది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి బియ్యం వితరణ



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మృతుని కుటుంబానికి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, చిమ్మపుడి మాజీ ఉప సర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు బియ్యం వితరణ చేశారు. చిమ్మపుడి గ్రామానికి చెందిన కాంపాటి వెంకన్న ఇటీవల మృతిచెందారు. గురువారం ఆ కుటుం బాన్ని గుత్తా వెంకటేశ్వర్లు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. తన వంతు సాయంగా 50 కేజీల బియ్యాన్ని వితరణగా ఆ కుటుం బానికి అందించారు.ఈ సందర్భంగా గుత్తా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్స రాలుగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా గ్రామంలో పేద కుటుంబంలో ఎవరైనా మృతి చెందితే ఆ కుటుంబానికి తన వంతు సహాయ సహకరాలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పేదింట ఆడపిల్లల పెళ్లికి సైతం పుస్తె, చీరె, సారె అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. గుత్తా వెంక టేశ్వర్లు గ్రామంలో చేస్తున్న సేవల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముమ్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

## ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** ప్రభుత్వ బడు ల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఇఓ దామాల పుల్లయ్య తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బోనకల్ జెడ్పిఎస్ఎస్ హైస్కూల్ నందు ప్రైవేట్ పాఠశాలలు వద్దు, ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అనే నినాదంపై కళాకారులు చాప లమడుగు కోటేశ్వరరావు, బంక భద్రయ్య బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ పాఠశాలల్లో అందిస్తున్న వసతులను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా విద్య, మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫామ్స్, పాఠ్య, నోట్ పుస్తకాలు తదితర సౌకర్యాలు ఉచితంగా కల్పించటం జరు గుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లీష్ మీడియం విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయబృదం తది తరరులు పాల్గొన్నారు.

# మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్



### -మాజీ జెడ్పి చైర్మన్ లింగాల

**ప్రజాపక్షం/ మధిర :** అమలు సాధ్యం కాని మోసపూరిత వాగ్దానాలతో తెలంగాణ ప్రజలకు మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిందని, ఇంతవరకు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని మాజీ జెడ్పి చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు విమర్శించారు. గురు వారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాటి కాంగ్రెస్ పెద్దలు అబద్దాలు చెప్పి అధికా రంలోకి వచ్చారని, అవే అబద్దాలు కొనసాగిస్తూ వస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆలోచిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను వేస్తామని చెప్తున్నారని, గత సీజనల్లో చెప్పిన విధంగా కాకుండా ఈ సారైనా రైతులందరికీ రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధిర ప్రాంతంలో ఇతర ఆనవాళ్లు లేకుం డా చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని, సుజల స్రవంతి తాగు నీటి పథకాన్ని తీసివేసి జాలిముడి ప్రాజెక్టు కట్టి దాని నుండి ఇప్పటి వరకు చుక్కతాగునీరు ఎవరికి అందిన పాపాన పోలేదన్నారు. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శంకుస్థాపన చేసిన బస్టాం డ్‌ను అభివృద్ధి పేరుతో తొలగిస్తున్నారని, నూతనంగా నిర్మించే బస్టాం డ్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. మధిర నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోకరంగా ఉండేందుకు ఆనాటి కేసిఆర్ ప్రభు త్వంలోమధిరలో నిర్మించిన 100పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారం భించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మధిర పట్టణ సుందరీకరణలో భాగంగా ఆనాటి పురపాలశాఖ మంత్రి కేటిఆర్ సహ కారంతో మధిరలో నిర్మించిన ట్యాంక్ బండ్ అధ్వాన్నంగా తయారైం దని, ఈ ప్రభుత్వం ట్యాంక్ బండ్‌ను ఏ మాత్రం పట్టించుకోవటంలేదని, అలాగే మధిర ఆర్వోబిపై మరమ్మత్తుల కోసం రూ.70లక్షలతో పనులు ప్రారంభించి పూర్తిస్థాయిలో పనులు కాకముందే మధ్యలోనే పనులను వదిలివేశారని అన్నారు. అదేవిధంగా మధిరలో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులు ఎవరికి అర్థంకాని పరిస్థితుల్లో అయోమ యంగా జరుగుతున్నాయని, అభివృద్ధి పేరుతో మధిర మున్సిపాల్టీని అధ్వాన్నంగా తయారు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా పాలకులు మధిర నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని, ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావే శంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన

**ప్రజాపక్షం/బోనకల్ :** మండల కేంద్రం బోనకల్ టిజిఎస్‌డబ్ల్యుర్ఎస్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గురువారం సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోన కల్, రావినూతల గ్రామాల్లో 40 సంవత్సరాలలోపు ఎస్టీ జనాభా వారికి 500మందికి పరీక్షలు నిర్వహించటం జరిగిందని, జూలై 3వ వరకు సికల్ సెల్ పక్షంగా ఆచరించి మండల పరిధిలోని ఇతర గ్రామాల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఓ, మండల వైద్యాధికారి, టిజిఎస్‌డబ్ల్యుఆర్ ఎస్ ప్రిన్సిపాల్ , హెల్త్ సూపర్వైజర్లు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## సికిల్ సెల్ అనిమియాపై అవగాహన



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** జిల్లా వైద్యా రోగ్యశాఖ ఆదేశాల మేరకు మండల పరిధి లోని దెందుకూరు పిహెచ్‌సి పరిధిలో వైద్యులు డాక్టర్ సాయి పృధ్వీరాజ్ ఆధ్వ ర్యంలో గురువారం సికిల్ సెల్ అనిమి యాపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిం చారు. ఈసందర్భంగా డాక్టర్ పృధ్వీరాజ్, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జూన్ 19 నుండి జూలై 3 వరకు సికిల్ సెల్ అని మియాపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ట్రైబల్ జనాభా నివ సించే ప్రాంతంలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, దీర్ఘకాలిక రక్తహీనతతో ఇబ్బందులు పడుతున్న వారు వెంటనే ప్రభుత్వ వైద్యుల వద్దకు వెళ్లాలని, పలు అంశాలను వివ రించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి ఆరోగ్య సిబ్బంది లంకా కొండయ్య, ఎఎన్ఎం రత్న మాల, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సరోజకు నివాళి



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల పరిధిలోని గేట్ రేలకాయలపల్లి గ్రామం మాజీ సర్పంచ్ బానోత్ సక్రం సతీమణి సరోజా దశ దిన కర్మలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా సరోజా చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్‌పి టిసి వాంకుడోత్ జగన్‌నాయక్, ఉన్నం వీరేం దర్, మాజీ సర్పంచ్ భూక్యా రమణ, మాజీ ఎంపీటీసీ శంకర్, మాజీ సర్పంచ్ భూక్యా సక్రం, దారావత్ వికాస్, గణతి ముత్యాల రావు, గణతి సత్యనారాయణ, రమేష్‌లు తది తరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ శ్రామికుడు రాహుల్ గాంధీ

### -ఘనంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నిస్వార్థ శ్రామికుడు రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. కాంగ్రెస్ లోక్‌సభ పక్ష నేత, ఏఐ సిసి అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో వేడుక లను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సిలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మి నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు తదితరులు వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేశం కోసం తన నానమ్మను పోగొట్టుకున్నా డని నానమ్మ నుంచి వచ్చిన మొండి పట్టుదలను పోగొట్టుకోలేదన్నారు. దేశం కోసం అత్యున్నత పదవిని కూడా త్యాగం చేశారన్నారు. తనను ద్వేషించిన వారిని సైతం ప్రేమించే వ్యక్తిత్వం ఉన్న వారన్నారు. నిస్వార్థ శ్రామికుడిగా రాహుల్ గాంధీ నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఐఎన్‌టియుసి అధ్యక్షులు కొత్తా సీతారాములు, పుచ్చకాయల వీరభద్రం, వెజండ్ల సాయికుమార్, సయ్యద్ గౌస్, ముజాహిద్ హుస్సేన్, గజ్జెల్లి వెంకన్న, కార్పొరేటర్లు సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, వెంకట నారాయణ, పలువురు నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** ఏఐసిసి అగ్రనేత, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జన్మ దినం సందర్భంగా మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, యూత్ కాంగ్రెస్ మధిర నియోజకవర్గ అధ్య క్షులు తూమాటి నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధి కారం చేపట్టి యువనేత రాహుల్‌గాంధీ ప్రధాని కావటం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో అద్దంకి రవికుమార్, ఆదూరి శ్రీను, జహంగీర్, కర్నాటి రామారావు, నిడమానూరి వంశీకృష్ణ, పతేపురుపు సంగయ్య, సంపసాల రామకృష్ణ, తలుపుల వెంకటేశ్వర్లు, కోట దేవిడ్, బండారు నర్సింహారావు, ఆవుల కిరణ్, మునుగోటి వెంకటేశ్వరరావు, యర్రగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతంలో పెట్రోల్ బంక్

-అభినందించిన ఎంఎల్ఏ జారె



ప్రజాపక్షం/ములకలపల్లి: గ్రామీణ ప్రాంతంలో పెట్రోల్ బంక్ నెలకొల్పటం అభినందనీయమని ఎంఎల్ఏ జారె ఆదినారాయణ అన్నారు. గురువారం జగన్నాథపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌పి పెట్రోల్ బంక్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పెట్రోల్ బంక్ ద్వారా జగన్నాథపురం, పరిసర గ్రామాల ప్రజలకు సులభంగా పెట్రోల్ డీజిల్ అందుబాటులోకి వస్తుందన్నారు. రైతులు వాహనదారులకు నాణ్యమైన ఇంధనాన్ని సరఫరా చేసి వారి మన్ననలు పొందాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/ములకలపల్లి: మండల కేంద్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీజీ జన్మదిన వేడుకల్లో ములకలపల్లి మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఘన చరిత్ర కలిగిన గాంధీ కుటుంబంలో జన్మించిన రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కటింగ్ చేసి, కార్యకర్తలకు అందజేశారు. దేశంలో మూడు వేల కిలో మీటర్ల పాదయాత్ర చేసి కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశంలో దారిద్య్రరేఖ దిగువన ఉన్నటువంటి ప్రజల జీవన శైలిని మార్చాలని, పేదరిక నిర్మూలన సమానత్వం కోసం వారు చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. భారతదేశానికి భావి ప్రధాని రాహుల్ గాంధీ అన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీ కార్మికులకు తక్షణమే జీతాలు అందజేయాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: రెండు, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయితీ కార్మికుల జీతాలను తక్షణమే అందజేయాలని టియూసిఐ అనుబంధ తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు, టియూసిఐ జిల్లా సహాయ కార్యదర్శి నూప భాస్కర్‌లు డిమాండ్ చేశారు. గురువారం ములకలపల్లి గ్రామ పంచాయితీ కార్మికులతో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న గ్రామ పంచాయితీ కార్మికులకు గత రెండు నెలలుగా జీతాలను ఇవ్వకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కొండ శ్రీను, కురసా వెంకటేష్, కుంజా నగేష్, వగ్గేల ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఉపకరణాల ఆన్‌లైన్ తేది పొడిగింపు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : దివ్యాంగుల సహాయ ఉపకరణాల ఆన్‌లైన్ ప్రక్రియ తేదీని ఈనెల 27వ తేది వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమశాఖాధికారి స్వర్ణలత లెనినా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిట్రో ఫిట్టెడ్ మోటార్ వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్లు, మొబైల్ బిజినె బ్యాటరీ వీల్ చైర్లు, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో హైబ్రీడ్ వీల్ చైర్ లాప్‌టాప్స్, 5జి స్మార్ట్ ఫోన్, ట్రై సైకిల్ వీల్ చైర్లు, వినికిడియంత్రాలు అందిస్తారని చెప్పారు. హెచ్‌టిటిపిఎస్://టిజిఒబిఎంఎంఎస్.సిజిజి.జిఒవి.ఇన్ లో ఆన్లైన్ దరఖాస్తులు చేసుకుని ఆ దరఖాస్తు ప్రతులను 27వ తేది లోగా ఐడిఒసి జి1 లో గల జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 6301981960, 8331006010 నెంబర్లను సంప్రదించ వచ్చన్నారు.

# సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు, ఇంటి స్థలాలు
- చెరువు ఆక్రమణను తొలగించి మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు చేయాలని అభ్యర్థన



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఏదులాపురం పర్యటకు వచ్చిన ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పలు సమస్యలను పరిష్కరించాలని గురువారం విన్నవించారు. ఈ సందర్భంగా దండి మాట్లాడుతూ...అర్హులైన ప్రతి ఒక్క నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు సహాయం చేస్తామని చెప్పడంతో నిరుపేదలు అప్పు చేసి బేస్‌మెట్లు కటుకున్నట్లు తెలిపారు. కానీ గత ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి రాకపోగా..ఇప్పుడు కట్టుకున్న ఆ బేస్‌మెట్ల వలన ఇందిరమ్మ ఇండ్లకు అనర్హులుగా మిగిలారన్నారు. కావున సదరు బేస్‌మెంట్లను కూడా పరిగణలోకి తీసుకొని ఆ పేదలకు సైతం ఇందిరమ్మ ఇండ్లు అందేలా న్యాయం చేయాలని కోరారు.అంతేకాకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కావాలసిన సిమెంట్ తక్కువ ధరకు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కబ్జాకొరల్లో ఉన్న ఈదుల చెరువు ఆక్రమణను తొలగించి మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ చెరువు ద్వారానే 35గ్రామాల ప్రజలకు మంచినీటి సరఫరా అందుతున్నట్లు తెలిపారు. ఏదులాపురం రెవిన్యూలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ ఈ ప్రాంత నిరుపేదలకు దక్కలేదన్నారు. అవి మొత్తం పలు సొసైటీలకు గత ప్రభుత్వాలు కూటాయిండంతో వందల మంది నిరుపేదలు ఇళ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై ప్రత్యేక చొరవను చూపి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలం మంజూరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

# ఏజెన్సీ డ్రాగన్ ఫ్రూట్ తోట.. ఆరు నెలలకోసారి కోత..!





ప్రజాపక్షం/మణుగూరు: డ్రాగన్ ఫ్రూట్ పండు అంటే తెలియని వాళ్లు ఎవ్వరూ ఉండరు. ప్రస్తుత సమాజంలో ఈ పండు తినడం వల్ల రక్తం వేగవంతంగా పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. ఈ పండులో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, కిడ్నీ సంబంధ వ్యాధులకు, అజీర్ణ సమస్యలకు ఈ పండు మంచి ఔషధంగా పని చేస్తుందని ఆరోగ్య నిపుణులు నొక్కి చెబుతున్నారు. వేరే రాష్ట్రాల వారు ఈ పండును భారీగా పెంపకం చేసి తెలుగు రాష్ట్రాలకి భారీగా దిగుమతి చేస్తున్నారు. ఏజెన్సీలో ఇంత వరకు పత్తి, వరి, మిరప, పుచ్చ, దొండకాయ, బెండకాయ, కాకరకాయ, దోసకాయ తదితర పంటలు పెంచడం చూసాం. కానీ ఓ మహిళ రైతు ఏకంగా డ్రాగన్ ఫ్రూట్ తోట వేసి పెంచడాన్ని అందరిని ఆశ్చర్య పరుస్తోంది. ప్రస్తుత మార్కెట్ లో ఈ పండు ధర రూ. 70 నుంచి 100 పలుకుతోంది...

ప్రస్తుత మార్కెట్ లో డ్రాగన్ ఫ్రూట్ మంచి డిమాండ్ ఉంది. దీంతో పండ్ల వ్యాపారస్థులు ఈ పండునే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఈ పండు కొనుగోలు చేసి అమ్మడం ద్వారా ఎక్కువ లాభాలు వస్తున్నాయని వ్యాపారస్థులు అంటున్నారు. ప్రస్తుత మార్కెట్ లో ఈ పండుకు ఉన్న డిమాండ్ మరి ఏ పండు కి లేదని అంటున్నారు. వేరే ప్రాంతాల నుంచి సరైన దిగుమతి లేకపోవడంతో ఈ పండు దొరకడం లేదని చెప్పుకొస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ లో ఈ పండు ధర రూ.70 నుంచి 100 పలుకుతోందని చెబుతున్నారు.

### తోట పెంపకం మహిళ రైతు మాటల్లో...

మణుగూరు మండలం, సమితి సింగారం పంచాయతీ సీతానగరం ప్రాంతంలో మల్లికంటి సావిత్రమ్మ అనే మహిళ నివాసం ఉంటుంది. తన భర్తకు ఈ పండు తోట వేసి పెంచాలని ఆయన కోరికని ఆమె తెలిపింది. వేరే ఒక ప్రాంతాన్ని నుంచి చిన్న మొక్క తీసుకొచ్చి వేశారని చెప్పింది. ఆ మొక్క పెద్దగా అయ్యే కొద్దీ దాని నుంచి మరి కొన్ని వేర్లు తీసి మరొక చోట వేసి పెంచమని, వేసిన మొక్కలకి కర్రలతో ఫెన్సింగ చేసి తీగలాగా ఏర్పాటు చేశామని తెలిపింది. ఈ మొక్క పెరిగే కొద్దీ దొండ తీగ, కాకర తీగ లాగా పాకుతూ గుబురుగా పెరుగుతోందని, ఈ మొక్కకి గేదె నుంచి వచ్చే మూలికలే వేసాం తప్ప మరి ఎలాంటి కెమికల్స్ వాడలేదని చెప్పుకొచ్చింది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కోతకు వస్తుందని సుమారు రూ.60 నుంచి 70 కేజీల వరకు పంట ఇస్తుందని తెలిపింది. మార్కెట్ లో ఒక్క పండు 70 నుంచి 100 రూపాయలు ఉంటే తాను మాత్రం కేవలం కేజీ 200 రూపాయలకు మాత్రమే అమ్ముతున్నాని చెప్పుకొచ్చింది. తన భర్త గత కొన్నాళ్ల క్రితం చనిపోయారని ఆయన ఆశయం కోసమే డ్రాగన్ ఫ్రూట్ తోట పెంచుతున్నానని తెలిపింది. ప్రస్తుత సమాజంలో వింత వింత జబ్బులు, వ్యాధులు వస్తున్న తరుణంలో తన దగ్గర కొనుగోలు చేసే వారికి ఎలాంటి జబ్బులు, వ్యాధులు రాకుండా ఉండాలని ఉద్దేశంతో కెమికల్స్ లేకుండా గేదె మూలికలతోనే తోటను సాగుచేస్తున్నానని పలికింది. తన పిల్లలు హైదరాబాద్ లో ఉంటున్నారని వారు హైదరాబాద్ కు పిలిచినా వెళ్లకుండా ఇక్కడే నా తుది శ్వాస విడిచే వరకు ఒక్కదాన్నే ఉంటూ తోటను మరింత పెద్దగా పెంచుకుంటూ ప్రజలకు ఈ పండును అమ్ముకుంటానని వెల్లడించింది.

# మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ప్రజాపక్షం/దమ్మపేట: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు, వంట బిల్లులు, గుడ్లు బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పెరుగుతున్న మార్కెట్ ధరలకు తగ్గట్టుగా విద్యార్థుల మెనూ చార్జీలు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. గురువారం వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ ఆఫీసు నందు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని లక్ష్మణ్ కు అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ నూతన విద్య సంవత్సరం ప్రారంభమైనప్పటికీ గత సంవత్సరం రావలసిన వంట కార్మికుల వేతనాలు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రస్తుతం స్కూళ్లలో మెనూ చార్టు ప్రకారం వంట చేయాలని ప్రభుత్వం చెబుతుందని పెరుగుతున్న ధర తగ్గట్టుగా మెనూ చార్జీలు పెంచకుండా మెనూ చార్టును ఎలా అమలు చేస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వంట కార్మికులకు శిక్షణల పేరుతో అనేక నిబంధనలు పెడుతుందని దానికి తగ్గట్లుగా వంట చేసేటప్పుడు ఉపయోగించే పరికరాలు ప్రభుత్వం ఎప్పుడు వంట కార్మికులకు అందిస్తుందో చెప్పటం లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం పదివేల రూపాయలు వేతనం వెంటనే పెంచాలని గ్యాస్ కు గుడ్లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ప్రభుత్వమే సరఫరా చేయాలని, రెండు జతల కాటన్ యూనిఫామ్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, వెంకటమ్మ, లక్ష్మి , పాపమ్మ, బాల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ఫా స్కానింగ్ సెంటర్‌పై చర్యలేవి..?

### బాధితులు ఫిర్యాదు చేసినా పట్టించుకోరా..?









ప్రజాపక్షం/సత్తుపల్లి: తమకు అన్యాయం జరిగింది, న్యాయం చేయాలంటూ సాక్షాత్తు బాధితులు ఫిర్యాదు చేసిన జిల్లా ఉన్నతాధికారులు అంటి ముట్టన్నట్లు వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు బాధితులు. బాధితులు ఫిర్యాదు చేసిన అధికారులకు బాధ్యత లేదా అంటూ మండిపడుతున్నారు. గత నెలలో పట్టణంలోని ఆల్ఫా స్కానింగ్ సెంటర్, బాలాజీ నర్సింగ్ హోంలపై చర్యలు తీసుకుని, న్యాయం చెరయాలని కోరుతూ గర్భిణీ భర్త కిరణ్ కుమార్ కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన అధికారులు ఇప్పటి వరకు ఆసుపత్రి, స్కానింగ్ సెంటర్ లపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ఉన్నతాధికారులను పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత కొన్ని నెలలుగా సత్తుపల్లి ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యం వికటించి రోగులు మరణిస్తుండటం, స్కానింగ్ సెంటర్లలో తప్పుడు రిపోర్టులతో రోగులు ఇబ్బందులు పడి ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల వద్ద ఆయా బాదితుల కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టిన విషయం అందరికీ తెలిసిన విషయమే. ఈ ఘటనలపై జిల్లా ఉన్నతాధికారులు తూ, తూ మంత్ర విచారణలు జరిపి, లోపాయికారి ఒప్పందాలు చేసుకుని రోగుల ఉసురు పోసుకుంటున్నారని బాధితుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమకు అన్యాయం జరిగిందని ఓ గర్భిణీ భర్త లిఖితపూర్వకంగా ఆల్ఫా స్కానింగ్ సెంటర్, లలిత కుమారి ఆసుపత్రులపై ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడంలో జిల్లా ఉన్నతాధికారులు వెనకడుగు వేయడం వెనుక మర్మం ఏమిటని ప్రజాస్వామ్య వాదులు ప్రశ్నిస్తున్నారు. రోజులు గడుస్తున్న చర్యలు తీసుకోక పోవటంతో ఆసుపత్రి యాజమాన్యాలు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకుల తీరు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌కు అనుమతులు లేకుండా ఆపరేషన్ చేసి రోగి మృతి కారణమైన ఎస్.వి.ఎస్ ఆసుపత్రి పై చర్యలు శూన్యం కాగా, బోర్డు మార్చుకోవాలని చెప్పి చేతులు దులుపుకోవడం, తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఆల్ఫా స్కానింగ్ సెంటర్ పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందించిన నేటి వరకు ఆ వైపుగా కన్నెత్తి చూడకపోవడం జిల్లా ఉన్నతాధికారుల తీరుపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. తక్షణమే ఆల్ఫా స్కానింగ్ సెంటర్ లలితకుమారి ఆసుపత్రులపై చీరలు తీసుకోవాలని, లేదంటే జిల్లా ఉన్నతాధికారులపై మానవ హక్కుల కమిషన్ ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలుపుతున్నారు. ఈ విషయంపై జిల్లా వైద్య శాఖ అధికారిణి కళావతిని వివరణ కోరగా తాము ఎంక్వయిరీ చేసి నోటీసులు ఇచ్చామని చెప్పారు. బాధితులకు ఈ విషయంలో ఎటువంటి సమాచారం లేకపోగా పత్రికలలో వార్తలు వచ్చిన మరుసటి రోజు డిప్యూటి డిఎంహెచ్ఓ స్కానింగ్ సెంటర్ ను సందర్శించారు. బాధితులు ఫిర్యాదు అనంతరం స్కానింగ్ సెంటర్ ,ఆసుపత్రులపై ఎటువంటి విచారణ జరగకుండానే విచారణ జరిపామని ఉన్నతాదికారిణి తెలపటం వారి నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తుంది.

# సిపిఐ మండల మహాసభను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/చంద్రుగొండ: నేడు జరగబోయే సిపిఐ రెండు మండలాల మహాసభను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బొర్రా కేశవరావు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన సిపిఐ చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలల సంయుక్త మహాసభను దామరచర్ల గ్రామంలో గల ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని జయప్రదం చేయాలన్నారు. పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని అన్నారు. మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో, పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవలందించేందుకు పురుడుపోసుకున్న పార్టీకి ప్రతినిధులుగా పని చేయడం అదృష్టంగా కార్యకర్తలు భావించాలన్నారు. జూన్ 21న మహాసభను పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి అయోధ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌డి సలీమ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు గార్లపాటి రామనాథం, జడ శ్రీనివాస్‌లు హాజరు కానున్నారని తెలిపారు.

# సిపిఐ మండల 13వ మహాసభను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/జూలూరుపాడు: సిపిఐ జూలూరుపాడు 13వ మండల మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని అన్నారు. మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో, పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవలందించేందుకు పురుడుపోసుకున్న పార్టీకి ప్రతినిధులుగా పని చేయడం అదృష్టంగా కార్యకర్తలు భావించాలన్నారు. జూన్ 21న మహాసభను పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సిపిఐ వైరా నియోజకవర్గ కన్వీనర్ ఎర్ర బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే నాగుల్ మీరా హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని మండల మహాసభను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎస్‌కే చాంద్ పాషా, సిపిఐ నాయకులు కంచర్ల రాఘవేంద్రరావు, నిమ్మటూరి లచ్చయ్య, పత్తిపాటి మహేష్, శివ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మండల కార్యదర్శిగా సబ్కం నాగేశ్వరరావు







ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాక కపర్తి భవనంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బూర్గంపాడు మండల 18వ మహాసభ విజయవంతంగా జరిగింది. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే షాబీర్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య, నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మున్నా లక్ష్మి కుమారిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన మండల కార్యదర్శి సబ్కం నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా పాండవుల బిక్షం, ముదిగొండ బాలకృష్ణ, 18 మంది కార్యవర్గ సభ్యులు 40 మంది, కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సబ్కం నాగేశ్వరరావు మాట్లాడుతూ మండల కార్యదర్శిగా ఎన్నుకున్న పార్టీ సభ్యులకు పార్టీ జిల్లా నాయకులకు అందరికీ ముందుగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ కోసం కష్టపడి పని చేస్తానన్నారు. మండలంలో ఉన్న ప్రధాన మైన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కొరకు దశల వారి ఉద్యమాలు చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో మాజీ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వరరావు(లడ్డా), జిల్లా నాయకులు పేరాల శ్రీనివాసరావు, అలవాల సీతారామిరెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, బలరాం, పిచ్చమ్మ, వంకాయలపాటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుక సందర్భంగా జూలూరుపాడు మండల కేంద్రంలో గవర్నమెంట్ హాస్పటల్ నందు కేక్ కట్ చేశారు. అదే విధంగా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంచి రాహుల్ గాంధీకి జూలూరుపాడు మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు కంచర్ల హరీష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సేవాదళ్ ప్రధాన కార్యదర్శి మాదుగుల నాగరాజు, గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, పసుపులేటి పవన్, పనితీ లక్ష్మణ్, షేక్ అఖిల్, మైక్ శ్రీను, నర్సులు, తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు పరామర్శ



ప్రజాపక్షం/దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం దమ్మపేట అర్బన్ కాలనిలో పలు కుటుంబాలను పరామర్శించారు. తుపాకుల గోపి ఇటీవలే మృతి చెందగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దండు శ్రీను దశ దిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, అబ్దుల్ జిన్నా, మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు గాజుబోయిన ఏసు, రూపా రాంబాబు, ఆటో శ్రీను, కాకాని వెంకన్న, కౌలురు దుర్గారావు, నీలిమ, కొండా భారతి తదితరులు ఉన్నారు.

## వాగు మల్లారంలో రేషన్ బియ్యం పట్టివేత



ప్రజాపక్షం/మణుగూరు: పట్టణ పరిధిలోని వాగు మల్లారంలో ఒక ఇంటిలో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గురువారం అధికారులు పట్టుకున్నారు. సివిల్ సప్లై డిటి తెలిపిన వివరాల ప్రకారం.. వాగు మల్లారం చెందిన వెంకట్ చౌదరి ఇంట్లో పిడిఎఫ్ నిల్వ చేశారని సమాచారంతో అతని ఇంట్లో తనిఖీ చేయగా 30 బస్తాల పిడిఎఫ్ దొరికిందని ఈ బియ్యాన్ని కేసు నమోదు చేసినట్టుగా ఆయన తెలిపారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నిమ్మటూరి రామకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా అధికారి సామినేని సత్యనారాయణకు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణ, మండల కేంద్రంలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ ప్రధాన అధికారి సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐటియూసి నాయకులు జిల్లా అధికారిని కలిసి జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్నం భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా విద్యాశాఖ ప్రధాన అధికారి సామినేనికి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర, కోరగా మెనూ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్నం భోజన కార్మికులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించాలంటే బాగుండేదన్నారు. కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం 2023 అక్టోబర్ 2 నుండి సీఎం పోషకాహార పథకాన్ని అమలు చేసిందని దానికి ఇప్పటివరకు దానికి సంబంధించిన బడ్జెట్ విడుదల కాలేదని, దీంతో చాలామంది వంట కార్మికులు వేలాది రూపాయలు నష్టపోయారని, తక్షణమే వారికి పెండింగ్‌లో ఉన్నటువంటి సీఎం పోషకాహార పథకాన్ని, రావాల్సిన నిధులను విడుదల చేయాలని నిమ్మటూరి కోరారు. అలాగే గత సంవత్సరం రావాల్సిన కోడిగుడ్ల బిల్లులు, 9, 10 తరగతుల మెనూ చార్జీలు తక్షణమే ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 1 నుంచి 8 తరగతి వరకు మెనూ చార్జీలను తక్షణమే ఇవ్వాలని కోరారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వంట పాత్రలు మంజూరయ్యాయని చెప్పారని, ఇప్పటి వరకు ఈ జిల్లాలో వంట పాత్రలు అందజేయలేదని, తక్షణమే వంట పాత్రలు, గ్యాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సత్తుపల్లి మండల కార్యదర్శి తెరగారపు రామారావు, మధ్యాహ్నం భోజనం కార్మికులు కర్లపూడి లక్ష్మి, తెలగారపు కనకదుర్గ, నిమ్మటూరి కృష్ణవేణి, వల్లెపు కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ అమ్మ ఒడిలాంటిది



**ప్రజాపక్షం/కారేపల్లి:** అంగన్వాడి అమ్మ ఒడిలాంటిదని అంగన్వాడీ టీచర్ జబ్బ వెంకట్ లక్ష్మి అన్నారు. గురువారం పోలంపల్లి అంగన్వాడి సెంటర్‌లో మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం పోలంపల్లి గ్రామ పంచాయితీ సెక్రటరీ రవి కుమార్, పిల్లల తల్లిదండ్రులు, స్థానిక ఉపాధ్యాయుల చేతుల మీదుగా చేయించారు. పిల్లలచే హోం రాయించి అక్షరాభ్యాసం చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరు అంగన్వాడీ కేంద్రంలో నమోదు చేయించాలని తల్లిదండ్రులకు తెలిపారు. ఈకార్యక్రమంలో పోలంపల్లి ప్రధానోపాధ్యాయులు అజ్మీరా దశ్రు నాయక్, సహా ఉపాధ్యాయులు బానోత్ తులసి రామ్, మోకాళ్ళ గుంపు ప్రధానోపాధ్యాయులు అజ్మీరా వీరునాయక్, ఆశ వర్కర్ జబ్బ స్వాతి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/సుజాతనగర్:** జులై 9వ తేదీన జరిగే దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అమరజీవి కుమారి రామయ్య మెమోరీ హాల్లో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ సమావేశం కుమారి హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ రెండోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు. అనేక పోరాటాల ఫలితంగా 12 గంటల పని దినాలను ఎనిమిది గంటలు సవరించుకున్న చరిత్ర ఏఐటీయూసీ పోరాట ఫలితమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం జులై 9న జరిగే సమ్మెకు మేల్కొని లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగాజరిగే సమ్మెకు అన్ని రంగాల కార్మికులు కర్షకులు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల రాములు, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దశ్రు, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీర్ల దుర్గాప్రసాద్, సిపిఐ నాయకులు దొడ్డ వెంకన్న, మండే పిచ్చయ్య, గడ్డం రాజేందర్, భూక్య శ్రీను, రవి, అజ్మీర జానీ తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపు





**-నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు**
**-ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు**

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలోని పలు ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న కట్టడాలను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. గురువారం ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు నేతృత్వంలో సిఐలు, ఎస్సైలు బృందాలుగా ఏర్పాడి తొలగింపులు చేపట్టారు. కమన్‌బజార్, కస్బాబజార్, పాతబస్టాండ్ ప్రాతాల్లోని ఫుట్‌పాత్‌లను చిరు, బడావ్యాపారులు ఆక్రమణలకు పాల్పడి వారివారి వ్యాపారాలకు సంబంధించిన వస్తువులను, స్టాల్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రహదారులకు ఇరువైపులా వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్‌లు చేయడంతో ఆయా మార్గాల్లో సంచరించే వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటుండంతో వారి ఫిర్యాదు మేరకు అక్రమ కట్టడాలను తొలగిస్తున్నట్లు ఏసిపి తెలిపారు. ఇందులో భాగంగా పాతబస్టాండ్ నుంచి కస్బాబజార్, కమాన్ బజారు వరకూ సుమారు కిలోమీటరు మేర ఫుట్‌పాత్‌లపై అక్రమించి ఏర్పాటు చేసిన టిఫిన్,టీ స్టాల్స్, చిరు వ్యాపారాలకు ముందస్తు సమాచారం ఇచ్చి తొలగించినట్లు తెలిపారు. పెద్దవ్యాపారులు ఫుట్‌పాత్‌లపై ఏర్పాటి చేసిన వారివారి వ్యాపారాలకు సంబంధించిన సామాగ్రి, ఇతర వస్తువులను తొలగింపచేసినట్లు తెలిపారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే నోటీసులు ఇచ్చి కేసునమోదు చేస్తామని సంబంధిత యజమానులు, సముదాయాల నిర్వాహకులను సూచించినట్లు తెలిపారు. నిత్యం ఫుట్‌పాత్‌లపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ మొత్తంలో జరిమానాలు విధించడం జరుగుందని హెచ్చరించారు. పాదాచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసువారికి సహకరించాలని అయన కోరారు.

# ఆదివాసీ యువతకు వాలీబాల్ కిట్లు, పిల్లలకు పలకలు పంపిణీ



**ప్రజాపక్షం/కరకగూడెం:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు కరకగూడెం మండలంలోని నిమ్మల గూడెం, నీలాద్రిపేట, గండివలస ఆదివాసి గ్రామాలలో పోలీస్‌లు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆదివాసీ ప్రజలు మావోయిస్టులకు ఎట్టి పరిస్థితుల్లో సహకరించవద్దని తెలిపారు. ప్రజలు ప్రభుత్వానికి సహకరిస్తూ అభివృద్ధి దిశగా పయనించాలని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునే మావోయిస్టులకు సహకరించవద్దని తెలిపారు. మావోయిస్టులవి కాలం చెల్లిన సిద్ధాంతాలని తెలిపారు. యువత, పిల్లలు విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. అసాంఘీక శక్తులకు సహకరించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తూ అనవసరంగా కేసులు, జైలుపాలు కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడుళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్ఐ పివిఎన్ రావు, స్పెషల్ పార్టీ టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

# తాటిగూడెంలో వన భోజనాల సందడి



**ప్రజాపక్షం/కరకగూడెం:** తెలుగు వారి వన భోజనం సందడి చేసింది. మనం మరిచి పోతున్న సంప్ర దాయాన్ని గుర్తు చేస్తూ కొత్త అనుభూతుల రుచి చూపింది. ప్రకృతి వడిలో ఆటలాడుతూ, సేద తీరుతూ గురువార ఆసాం తం ఆస్వాదించేలా చేసింది. ఏటా వేలాది మందితో వనభోజనాలు బతుకమ్మ పండు గను విశేషంగా నిర్వహిస్తూ ప్రపంచ వ్యాప్తంగా గల తెలుగు ప్రజల దృష్టిని ఆకర్శించిన వనభోజనాలు ఈ కార్యక్రమానికి ఆతిధ్యమిచ్చింది. కరకగూడెం మండల పరిధిలోని తాటిగూడెం, విప్ప చెట్టి గుంపు, పద్మపూరం, అనంతారం, బర్లగూడెం, బట్టుపల్లి, చిరుమళ్లు, రేగుళ్ల, కొత్తగూడెం, గొల్లగూడెం గ్రామ ప్రజలు అడవి ఈ ప్రాంతానికి వెళ్లి ఆదివారం వన భోజనాల సందడితో ప్రతి గ్రామం నుండి ప్రతి ఇంటి నుండి అందరూ నాటు కోళ్లతో భోజనాలు సందడి చేసుకుని తిరిగి ఇళ్ళకి వస్తారు. వనభోజనాల వేడుక ఆరంభంలో స్థానిక కళాకారుల బృందం ప్రదర్శించిన నాటు డాన్స్ ఉర్రూతలూగించింది. అనంతరం తెలుగు వారందరూ నాటు డాన్స్ ఎంజాయ్ చేశారు. ఉత్సాహంగా పిల్లలు పతం గులను ఎగురవేశారు. ఆటలను ఎంజాయ్ చేశారు. గెలిచిన వారికి బహుమతులు డాక్టర్ దుర్గం గణేష్ ఇచ్చారు. భోజనాలు, ఆటపాటలతో పాటు కబడ్డీ క్రీడాను ఈ కార్యక్రమానికి దుర్గం ప్రేమ్ కుమార్, కరకగూడెం మండలం జేఏసీ మండల అధ్యక్షులు పూలెబోయిన వెంకటనారాయణ, నియోజకవర్గ మహిళా యూత్ ప్రెసిడెంట్ పూనెం శృతి, పోలేబోయిన రజిత, కొమరం కవిత, పోలెబోయిన నాగరాణి, చందా పూర్ణిమ, చందా విజయలక్ష్మి , కొమరం విజయలక్ష్మి , పూనెం శ్యాంకుమారి,దుర్గం జ్యోతి, గ్రామ యూత్ లీడర్స్ దుర్గం స్వాతి, గ్రామ కమిటీలు దుర్గం రాణి, రామంటేకి మనీషా, జాడి దీపిక, జిమ్మిడి సరిత, రామటేంకి విమల, దుర్గం మౌనిక, లావణ్య, దుర్గం సుష్మ, జిమ్మిడి రాధ, రామటెంకి సంధ్యారాణి, వీరలక్ష్మి , జాడి కళ్యాణి, గాంధర పూజా, జాడి మంగవేణి, జనంగం అలివేలు, జాడి నిరోషా, దుర్గం జాడి దీపిక, దురంగ, మండల గ్రామస్తులు తదితరులు నిర్వహించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ప్రతి ఇంటి నిర్మాణ వివరాలు సంబంధిత పంచాయతీ కార్యదర్శి వద్ద ఉండాలని, ఎప్పటికప్పుడు ఇంటి నిర్మాణాన్ని పర్యవేక్షించాలని పాలేరు ప్రత్యేక అధికారి రమేష్ అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో పాలేరు నియోజకవర్గ క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జి తంబూరి దయాకర్‌రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. మొదటగా తిరుమలాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరుపేదలకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని వారు సూచించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. తిరమలాయపాలెం మండలంలోని 40 గ్రామపంచాయతీల పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన నిర్మించాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణాన్ని చేపట్టే లబ్ధిదారుకలు ఇందిరా క్రాంతి పథకం ద్వాదా రుణాలు ఇప్పించేందుకు సంఘాలతో మాట్లాడి రుణాలు ఇప్పించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎస్కే సిలార్‌సాహెబ్, ఎంపిఓ పి.సూర్యనారాయణ, గృహ నిర్మాణశాఖ ఇంజనీర్ మిథున్, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పిఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు తిరుమలాయపాలెం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల కాలంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు పిఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందించటం జరిగింది. ఈ సందర్భంగా చావా శివరామకృష్ణ మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాలేరు నియోజకవర్గంలో వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉండేందుకు ఈ ఆర్థిక సాయం అందిస్తూ భరోసా కల్పిస్తున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బెల్లం శ్రీను, మద్దులపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి, డైరెక్టర్ జడల నగేష్, మండల నాయకులు ఉన్నం రాజశేఖర్, సిరిగద్దే ఉపేందర్, లింగయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు దూదిమెట్ల వెంకట్, దొడ్డ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన విద్యనందించాలి : కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు విలువతో కూడిన విద్యను అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం లోని న్యూగొల్లగూడెం కిడ్స్ పాఠశాలలో గురువారం 8వ తరగతిని కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలు వ్యాపార దృక్పథంతో కాకుండా తమ విద్యా చక్కటి విద్యను చెప్పి దేవాలయాలుగా ఉండాలన్నారు. పట్టణంలోని కిడ్స్ పార్క్ పాఠశాల మెరుగైన విద్యను అందించి విద్యార్థుల భావి తరానికి బాటలు వేయాలన్నారు. ఏజెన్సీ గ్రామాలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణంలో స్థాపించిన ఈ పాఠశాల పేద విద్యార్థులకు విద్యను అందించడం అభినందనీయం అన్నారు. అనంతరం విద్యార్థులు పలు ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, నాయకులు మాచర్ల



శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, యూసుఫ్, ధర్మరాజు, సత్యనారాయణ చారి, దుర్గ, నేరేళ్ల రమేష్, ముత్యాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# లొంగిపోయిన 12 మంది మావోయిస్టు దళ సభ్యులు




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : వివిధ క్యాడర్లలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పనిచేస్తున్న 12 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు గురువారం జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్ ముందు లొంగిపోయారు. ఈ మేరకు ఆయన వారిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూతలో భాగంగా 12 మంది వివిధ క్యాడర్లకు చెందిన మావోయిస్టు సభ్యులు లొంగిపోయారన్నారు. తెలంగాణఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాలు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీకి సహకరించరాదన్నారు. వారి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు ఇవ్వాలని అన్నారు. ఇటీవల కాలంలో 20 మంది సాయుధ దళ సభ్యులను ములుగు జిల్లాలో అరెస్టు చేసి వారి నుండి 12 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలవాలన్నారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం పునరావాసాన్ని కల్పిస్తుందని చెప్పారు. ఇప్పటికే చాలా మంది లొంగిపోయి కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవిస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోతే వారి అభివృద్ధికి కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, సిఆర్‌పిఎఫ్ 81,141 బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ పాఠశాల ప్రవేశాలకు పకడ్బందీగా పోటీలు

ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రభుత్వ ప్రవేశపెట్టిన స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే పోటీలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు సీఎంఓ, ఫిట్ ఇండియా జిల్లా నోడల్ అధికారి రాజశేఖర్ తెలిపారు నేలకొండపల్లి మండలంలోని సింగారెడ్డి పాలెం, నేలకొండపల్లి లోని పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సింగారెడ్డి పాలెం పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులను కంప్యూటర్ గురించి అడిగి తెలుసుకున్నారు. వారి సామర్థ్యాన్ని చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు అనంతరం వికలాంగులకు పునరావస కేంద్రంలో సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని రాజేశ్వర పురం గ్రామంలో ఉన్న భవిత కేంద్రం ను, నేలకొండపల్లిలోని వికలాంగుల పునరావస కేంద్రంలో విలీనం చేసినట్లు ప్రకటించారు. జిల్లాలో వికాసం కేంద్రం గా పైలెట్ ప్రాజెక్టుగా నెలకొండపల్లిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వారికి అవసరమైన ఫిజియోతెరపి, వివిధ పరీక్షలు నిర్వహించి వారిలో చైతన్యం కల్పించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో నెల 21 వరకు మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా స్థాయి లో స్పోర్ట్స్ పాఠశాల ప్రవేశాలకు సంబంధించిన పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 22వ తేదీన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.



జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన పుస్తకాలు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు తల్లిదండ్రులు ప్రైవేట్ మోజులో పడి ప్రభుత్వ పాఠశాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. నెలకొండపల్లి ప్రకాశం కేంద్రంలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర అధికారులకు నివేదికను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల విద్యాశాఖ అధికారి బాలిన చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ నిరుపయోగ వస్తువులు వేలం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పోలీస్ శాఖలో నిరుపయోగంగా ఉన్న వివిధ వస్తువులను ఈనెల 26న వేల వేయనున్నారు.ఈ వేలాన్ని పోలీస్ హెడ్ క్వార్టర్స్ హేమచంద్రాపురంలో జరుగుతుందని పోలీస్ వెల్లడించారు. సిపియులు, కి బోర్డులు, మౌస్‌లు, యుపిఎస్‌లు, ట్యాబ్‌లు, యాపిల్ ఐప్యాడ్, ఇన్వర్టర్లు, ఇన్వర్టర్ బ్యాటరీలు, డ్రాగాన్ లైట్లు, టార్చ్ లైట్లు, క్లాత్ టెంట్లు, కుర్చీలు, ఫ్రిజ్‌లు, బీరువాలతో పాటు ఇతర సామాగ్రి, వస్తువులు వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు ఒరిజనల్ ఆధార్ కార్డుతో పాటు ఒక జిరాక్స్ కాపీని తీసుకుని అడ్మిన్ఆర్ఐ షేక్ లాల్‌బాబు 8712682143 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆళ్లపల్లి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వాసం శ్రీనాథ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అధ్యక్షులు వాసం శ్రీనాథ్ మాట్లాడుతూ యువనేత రాహుల్ గాంధీ సేవా భావాన్ని స్మరించడంతో పాటు, ఆయన దీర్ఘాయుష్మంతుడిగా, ఆరోగ్యంగా ఉండాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటూ ఈ విధమైన కార్యక్రమాలు సమాజంలో సహాయం, సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో కో ప్రచార కమిటీ సభ్యులు వాసం శ్రీకాంత్, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు నర్సమ్మ, చింత బాలకృష్ణ, బట్టిని శ్రీధర్, కొమ్ము శ్రీను, యువజన నాయకులు నిట్ట ధిల్లీప్, లకుమాళ్ళ స్టాలిన్, భారత్, తులం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నేడు ఆళ్లపల్లి మండలంలో మంత్రి పొంగులేటి, ఎంఎల్ఏ పాయం పర్యటన

ప్రజాపక్షం/ఆళ్లపల్లి: నేడు ఆళ్లపల్లి మండలంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పర్యటించనున్నారని ఆళ్లపల్లి కాంగ్రెస్ పార్టీ కో ప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఉదయం 9గంటలకు మండల కేంద్రంలో గల కస్తూరిభా హాస్టల్ భవనం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ఇందిరమ్మ లబ్దిదారులకు ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, కావున మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు, వివిధ సంఘాల నాయకులు అభిమానులు అందరూ సకాలంలో స్వచ్ఛందంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## అశోక్ డిజిటల్ స్టూడియో ప్రారంభం

ప్రజాపక్షం/కారేపల్లి: మండల కేంద్రమైన కారేపల్లిలో నూతనంగా అశోక్ డిజిటల్ స్టూడియోను గురువారం ప్రారంభించారు. బస్టాండ్ సెంటర్ డిసిసిబి బ్యాంక్ పక్కన కారేపల్లి జర్నలిస్ట్ బోడ అశోక్, చందు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్టూడియోను సింగరేణి సిఐ తిరుపతి రెడ్డి, తహసీల్దార్ ఎస్ సంపత్‌కుమార్, కారేపల్లి



ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు, ఎస్ఐ బైరు గోపీలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యువత తమ కాళ్లపై తాము నిలబడటం ఉపాధి ఎంచుకోవడం అభినందనీయమన్నారు. డిజిటల్ స్టూడియో రంగంలో వస్తున్న నూతన టెక్నాలజీని అందిపుచ్చుకొని అందరి అభిమానం చురగొనాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా స్టూడియో అధినేత అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హన్మకొండ రమేష్, ధారావత్ హేమలత బాలాజీ, గుగులోత్ నారాయణ, గుగులోత్ ప్రకాష్, ధరావత్ భద్రు, గుగులోత్ నవీన్, గుగులోత్ లక్ష్మణ్, దేవా, రామ్ కిషోర్, మాజీ ఎంపిటిసి గద్దం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ గోపాల్‌నాయక్, ప్రముఖ కవి గాయకుడు ఆదెర్ల శంకర్, జర్నలిస్టు రాజు, శ్రీను, రవీందర్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు మరింత అంకితభావంతో పనిచేయాలి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : వైద్యులు మరింత అంకితభావంతో పనిచేసి మంచి సేవలు అందించి మరింత మంచిపేరు తేవాలని రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమీషనర్ డా.జితేష్ పాటిల్ అన్నారు. గురువారం ఆయన పాల్వంచ ప్రభుత్వాస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా



మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల్లో రోగులకు అంకితభావంతో వైద్య సేవలు అందించడం అభినందనీయం అన్నారు. ఉత్తమ సేవలు అందించిన భద్రాచలం, చర్ల, అశ్వారావుపేట, బూర్గంపాడు, మణుగూరు, ఇల్లందు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందించిన వైద్యులకు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ప్రశంసా పత్రాలు అందజేశారు. బాధ్యతగా మెలుగుతూ మరిన్ని సేవలు చేయలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని వైద్యులంతా చాలా కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా.రవిబాబు, వైద్యవిధాన పరిషత్ సూపరింటెండెంట్‌లు, నర్సింగ్, పారామెడికల్, సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సమావేశం

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి గురువారం నూతన రైల్వే లైన్‌కు భూములు కోల్పోయిన రైతులతో ప్రత్యేక సమావేశం, గ్రామ సభ తహశీల్దార్ మన్నె ఉషాశారద సమక్షంలో ఎర్రుపాలెం రైతు వేదికలో నిర్వహించారు. ఈసందర్భంగా రైతులతో



మాట్లాడుతూ ఎర్రుపాలెం, కేశిరెడ్డిపల్లి గ్రామాల్లోని రైల్వేలైనుకు భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం అందించే నష్టపరిహారంపై వివరించారు. రైతుకు చెందిన ఎంత భూమి రైల్వే లైన్‌కు తీసుకున్నది వివరించారు. భూములు నష్టపోయిన ప్రతి రైతుకు తప్పకుండా ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎర్రుపాలెంలో జరుగుతున్న రైతు రెవెన్యూ సదస్సు, సఖినవీడులో జరుగుతున్న సదస్సులు పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతు సదస్సులో 145 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఆర్ఐలు ఎస్ రవికుమార్, బి.రాజశేఖర్, ఎఎస్ఓ జాన్‌దర్గాసాహెబ్, యుడిసి శిరీష, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోకసభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్



బండారు నర్సింహారావు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శీలం శ్రీనివాస్‌రెడ్డి, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, కడియం శ్రీనివాసరావు, పసుపులేటి వెంకటనారాయణ, షేక్ ఇస్మాయిల్, నాగిరెడ్డి, కంచర్ల వెంకటనర్సయ్య, పంబి సాంబశివరావు, జంగా పుల్లారెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి, దేవరకొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాదానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజం

## సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం





**ప్రజాపక్షం/కొణిజర్ల :** బిజేపి దాని అనుబంధసంస్థ అయిన ఆర్ఎస్ఎస్ అవలంబిస్తున్న మతోన్మాదానికి కమ్యూనిజం మాత్రమే ప్రత్యామ్నాయం అవుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. కొణిజర్లలో గురువారం దొండపాటిభవన్‌లో తోటపల్లి సీతారాములు, చింతల ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన గ్రామశాఖ మహాసభలో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో పేద ధనిక తేడాలేకుండా ఎంతో బాద్యతతో సేవలందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరంచేస్తు మోడి ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆయన విమర్శించారు. భారత దేశ ప్రజలు కష్టంతో దేశంలో అనేక సంవత్సరాలుగా నిర్మించబడిన ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఎల్ఐసి, రైల్వే, విమాన విశాఖ ఉక్కు లాంటి లాభాల్లో నడిచే దిగ్గజ సంస్థలను ప్రయివేటు పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెట్టాలని చూస్తున్నారని అటువంటి చర్యలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా దేశంలోని విలువైన ఖనిజ సంపదను కార్పోరేట్ శక్తులకు బిజెపి ప్రభుత్వం దోచిపెడుతుంని అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను చంపుతున్నారని నక్సలైట్లుకూడా భారతదేశ పౌరులేనని అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులతో చర్చలు జరుపుతామన్న బిజెపి ప్రభుత్వం నక్సలైట్లుతో చర్చలు జరపకుండా చంపేయడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని అని అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సబ్యులు యర్రా బాబు మాట్లాడుతు స్థానిక సంస్థల్లో సిపిఐ ప్రజాప్రతినిధులు గెలిపించుకొని బలం పెంచుకుంటేనే పేదప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. అందుకు తగిన విధంగా ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. 2004 లో పార్లమెంట్‌లో కమ్యూనిస్టుల ఎంపిల బలం ఉండటంవల్లనే ఉపాధిహామి, అటవీ హక్కుల, సమాచార హక్కు చట్టాలు తీసుకురావడం సాధ్యపడిందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మర్చిందని అన్నారు. పేదవాడికి ఇండ్లు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంవల్లే నిరుపేద కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభలో తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, సిపిఐ సీనియర్ నాయకులు బండారు పుల్లయ్య, బండారు వెంకన్న, కడప బాబు, కోయిన్న వెంకయ్య, గొడ్డు గొర్ల రాంబాబు, గొడ్డుగొర్ల శ్రీను, కాల్వకట్ల ప్రసాద్, తండు సోమయ్య, నరసింహారావు, బొమ్మకంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొణిజర్ల గ్రామశాఖ క్యాదర్శిగా స్వర్ణ రమేష్; సహాయ కార్యదర్శిగా తోటపల్లి సీతారాములు, చింతల ఆదినారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# మహిళా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

## -కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతరావు





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహిళల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతరావు తెలిపారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జిల్లా మహిళా కాంగ్రెస్ ఎగ్జిక్యూటీవ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళల పట్ల చిన్నచూపు చూసిందన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు తోడ్పాటు నందిస్తుందన్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మహిళలు ధైర్యంగా ఆత్మగౌరవంతో బతకవచ్చునన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో మహిళలపై ఎన్నో దాడులు, అవమానాలు చూశామన్నారు. మహిళల పేరు మీదే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. అనంతరం రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఖమ్మం నగరంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్త గుంటి భవాని ఇంటి వద్ద సన్న బియ్యంతో వండిన అన్నాన్ని తిన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దుంపా రూప, ప్రధాన కార్యదర్శి జాను, కార్యదర్శి కుమారి, భద్రాద్రి కొత్తగూడెం కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, దామా స్వరూప, బిక్కసాని స్వరూప, దేవత దివ్య, కొత్తపల్లి పుష్ప, చంద్రిక, అన్నపూర్ణ, సుగుణ, ప్రతిభా రెడ్డి, లక్ష్మి , నీలవేణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# పాకలపాటికి ఘన నివాళి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బేతుపల్లి గ్రామానికి చెందిన పాకలపాటి సీతారాం ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు గురువారం సీతారాం నివాసానికి చేరుకుని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరమర్శించారు. మువ్వా వెంట కొత్తూరు కోటేశ్వరరావు, దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు), దొడ్డా కిషోర్, మట్టా ప్రసాద్, మానస నాని, బాల పుల్లయ్య, దొడ్డా శంకర్‌రావు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని రఘునాథపాలెం మండల విద్యాశాఖాధికారి రాములు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన కోరారు. గురువారం మండల పరిధిలోని వేపకుంట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే నోటు పుస్తకాలతో పాటు మాజీ సర్పంచ్ రమేష్ సహకారంతో సమకూర్చిన సామాగ్రిని ఎంఈవో రాములు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. సుశిక్షుతులైన ఉపాధ్యాయులచే బోధన చేపడుతున్నామన్నారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని, ఉదయం రాగి జావ, వారంలో మూడు రోజులు కోడిగుడ్లు వంటి సదుపాయాలు కూడా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ వేపకుంట్ల లోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి 10 వరకు విద్యా బోధన ఉందన్నారు. విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పారుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అబ్దుల్ జబ్బార్, శ్రీకాంత్, ఏఏపిసి ఛైర్మన్ చెన్నా రేణుక, సర్వీస్ పర్సన్స్ అలివేలు, మధ్యాహ్న భోజన వర్కర్లు మణెమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు అధ్యక్షతన రాహుల్‌గాంధి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత అభివృద్ధి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపాల్ చైర్మన్ జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, మచ్చా బుజ్జి, పొదిలి హరినాథ్, బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, పాలేటి నర్సింహారావు, వీరంశెట్టి సీతారాములు, శ్రీరామనేని తిరుపతిరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, దార్న రాజశేఖర్, బొర్రా గోవిందరావు, పువ్వాళ్ళ రాము, సూర్యదేవర శ్రీధర్, కర్నాటి హనుమంతరావు, కొల్లి రమేష్, పమ్మి వెంకయ్య, కాకాటి ఏసు, వైరా అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోటకూర గోపి పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/వైరా:** సైనో విట క్రాప్ సైన్స్ లిమిటెడ్ అనే వ్యవసాయ సంబంధిత కొత్తగా కలుపు మందులు , పురుగు మదులు, తెగుళ్ల మందులు వాటి వాడుక విషయంలో అవగాహన కలిగించి వైరా మండలం పినపాక గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. బెట్ట వాతావరణం ఉండుట వలన సాలు పత్తి వేసిన రైతులు గుంటకల్‌లో సాలు మధ్యన పాటు చేయడం వలన కలుపు నివారణతో పాటు రసం పీల్చే పురుగులను నివారించవచ్చును. బోదే పత్తి వేసిన రైతులు సాలు మధ్యలో కలుపు మందులు కొట్టుటకు ఇన్విక్స్ లేక హారిగీస్ కలుపు మందును వాడటం వలన పత్తి పంటల్లో కలుపు నివారించవచ్చును. సైనో విట కంపెనీ ప్రతినిధులు డి.ప్రశాంత్, ఎండి అగ్రోజో జెడ్ఎం రాజీవ్‌రెడ్డి, తావూరియా, ఏఎస్ఎం పాల్గొని పంట దశ నాలుగు నుండి ఆరు ఆకుల దశలో మందు వాడుట వలన మంచి పనితనం అధికంగా ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు.

# కొనుగోలు సమయం.. పాఠశాలకు పయనం..!



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని పుస్తకాల దుకాణాలలో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులతో రద్దీ పెరిగింది. పాఠశాలలు నడుస్తుండటంతో పిల్లలు బడుల బాట పట్టడంతో పుస్తకాలు దుకాణాలు వద్ద పాఠశాల ఏకరూప దుస్తులు, బూట్లు, స్కూల్ బ్యాగ్‌లు, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు కొనుగోళ్లలో నిమఘ్నమయ్యారు. ఈ మేరకు కొన్ని రోజుల నుంచి దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఇదే అదునుగా ధరలకు అనుగుణంగా ఎంతైనా తప్పదనే ఉద్దేశం మీద తల్లిదండ్రులు పుస్తకాలను, పెన్సిళ్లను, పెన్నులు విద్యార్థులకు కావలసిన సామాగ్రిని కొని పాఠశాలకు పంపిస్తున్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. డా.మట్టా రాహుల్ జన్మదిన వేడుకల కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ పట్టుదల, ఓపిక ఎంతో మందికి స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, సత్తుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివా వేణు, చల్లగుళ్ళ నరసింహారావు, సత్తుపల్లి పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, ఎన్ ఎస్ యు ఐ నాయుకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న డ్రైన్ పనులను ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. గురువారం ఖమ్మం నగరంలోని ఇల్లందు క్రాస్ రోడ్డు ఐటి హబ్ వద్ద , అల్లిపురం రోడ్డులో నిర్మాణంలో ఉన్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. డ్రైన్ పనుల పురోగతిని సమీక్షించారు. డ్రైన్ నిర్మాణానికి ఉపయోగిస్తున్న మెటీరియల్, నాణ్యత, డిజైన్ తదితర వాటిని అధికారులు కమిషనర్‌కు వివరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైన్ నిర్మాణ పనులు క్రమబద్ధంగా సాగాలన్నారు. ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిర్మాణ ప్రాంతంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.